

రాజకీయ కక్ష సాధింపులు ఆపాలి

గండేపల్లి: రాజకీయ కక్ష సాధింపులతో మిడ్ డే మీల్స్ వర్కర్సను తొలగించడం తగదని సిఐటియు నాయకులు అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న మిడ్ డే మీల్స్ వర్కర్లు, ఆయాలను తొలగించడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక ఎంఇఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద వర్కర్లు, ఆయాలు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మిడ్ డే మీల్స్ వర్కర్స్ జిల్లా నాయకురాలు ఎస్.ఈశ్వరి మాట్లాడుతూ సింగరాయపాలెంకు చెందిన నొక్కి నూకరత్నం, నాగమణిలను రాజకీయ వేధింపులతో తొలగించారు అన్నారు. వెంటనే సమస్య పరిష్కారం అవ్వకపోతే నిరవధికంగా దిగుతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి ఎన్వేశ్వరం, ఒబ గంగ, ఎస్.నూకరత్నం, ఆర్.నాగమణి, ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు లలిత పాల్గొన్నారు.

సర్వేలతో సతమతం..!

- జాబ్ ఛార్టులో లేని పనులతో అవస్థలు
- ఆశాలపై కొనసాగుతున్న పని ఒత్తిడి
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు చూస్తూ మాతా శిశు మరణాలు తగ్గించడం కోసం కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లు సర్వేలతో తీవ్ర స్థాయిలో సతమతమవుతున్నారు. జాబ్ చార్టులో లేని, సంబంధం లేని పనులతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పని ఒత్తిళ్లతో అనారోగ్యాలకు గురవుతున్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులతోపాటు అధికార పార్టీలో ఉన్న నేతల ఒత్తిడులను కూడా ఎదుర్కొంటూ అష్ట కష్టాల నడుమ విధులను నిర్వర్తిస్తున్నారు.

కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3,200 మంది ఆశ కార్యకర్తలు పని చేస్తున్నారు. నిరంతరం ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న ఆశాలకు పని ఒత్తిడి ఎక్కువైంది. వివిధ సర్వేల పేరుతో నిరంతరం పని చేయాల్సి వస్తుంది. లెప్రసి, టీబీ, మలేరియా, ఎన్‌సిబి, పిల్లల ఇమ్యునైజేషన్ కోసం ఇంద్ర ధనస్సు వంటి సర్వేలు చేస్తున్నారు. అలాగే ప్రతి గురువారం ఆయా పాఠశాలల్లో ఐరన్ టాబ్లెట్లు వీళ్లే మింగించాల్సి వస్తుంది. ఎఎన్ఎంలు చేయాల్సిన పనులను ఆశాలే చేయాల్సి వస్తుంది.



ధర్నాలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు(ఫైల్ ఫోటో)

అదనపు పనులతో సతమతం

మాతా, శిశు మరణాలను అరికట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆశాలను నియమించింది. అయితే జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో ఉన్న లెప్రసి, టీబీ, ఇమ్యూనైజేషన్ అధికారులు నేరుగా ఆశాలను ఆదేశిస్తూ సర్వేలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ-ఆశా యాప్‌లో తొమ్మిది రకాల పనులను మాత్రమే చేయాలని నిర్దిష్టంగా ఆదేశాలు ఉన్నాయి. దాని ప్రకారం ఆశాలు వారి వారి పరిధిలో 12 వారాల లోపు గర్భిణీలను గుర్తించి నమోదు చేయాలి. గర్భిణీల ఆరోగ్య పరిస్థితులపై నిర్దేశిత సమయంలో విజిట్లు చేసి తగు జాగ్రత్తలు వారికి గుర్తు చేయాలి. గర్భిణీలను ప్రోత్సహించి ప్రభుత్వాసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రసవించిన తర్వాత బాలింతలకు జాగ్రత్తలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. 42 రోజుల్లో ఏడుసార్లు విజిట్ చేసి వారికి శిశువుల పరిశుభ్రత భద్రతపై అవగాహన కల్పించాలి. పుట్టిన 45 రోజులు లోపు వేయవలసిన టీకాలు వేయించే చర్యలు తీసుకోవాలి. వివాహమైన జంట, అలాగే పిల్లలు పుట్టకుండా ఎవరైనా ఉంటే వారి వివరాలను సర్వే చేయాలి. పిల్లల కోసం నిరంతరం పర్యవేక్షణ చేయాలి. ఇలా తొమ్మిది రకాల పనులను ఆశాలు చేసేలా జాబ్ చార్ట్ ఉంది. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సంబంధిత విభాగాల ఉద్యోగులు ఆశాలను వివిధ రకాల సర్వేలకు ఉపయోగించుకోవడంపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా లెప్రసి సర్వే చేయిస్తూ గత రెండేళ్లుగా పారితోషకాలు కూడా ఇవ్వడం లేదు. దీనిపై ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్ ను కలిసి వినతి పత్రం ఇచ్చి తమకు అందాల్సిన పారితోషికాలు ఇవ్వాలని కోరారు. అలాగే అదనపు పనులను చేయించుకుంటున్నప్పటికీ అధికారులు ఎటువంటి టిఎ, డిఎలు కూడా ఇవ్వడం లేదు. ఆశాలపై అదనపు పనిభారంలో భాగంగా ప్రతి వారం ఫ్రైడే డ్రైలో కూడా వీరితోనే పనులు చేయిస్తున్నారు.

సర్వేల పేర ఒత్తిడి సరికాదు



ఆశాలు వివిధ సర్వే పేరుతో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వీరిని చులకనగా చూస్తూ రకరకాల సర్వేలు చేయిస్తున్నారు. జాబుఛార్టులో లేని పనులను వీరికి అప్పగిస్తున్నారు. ఇది సరికాదు. ఇప్పటికైనా ఆశలపై పని ఒత్తిడి తగ్గించాలి. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

-చంద్రమళ్ళ పద్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అధికారుల తీరు సరి కాదు

చీటికీ మాటికీ ఆశలపై సర్వేల భారం మోపుతున్నారు. అరకొర వేతనాలే ఇస్తుండగా అదనపు పనుల వలన ఒత్తుళ్లకు గురై అనారోగ్యాల పాలవుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఆశలపై పని భారం లేకుండా చర్యలు తీసుకోవాలి.

-నర్ల ఈశ్వరి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వాలంటీర్లు

హామీ అమలు కోసం వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి గ్రామ, వార్డు వాలంటీర్ల సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం వాలంటీర్లు తమ డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకి అందించారు. అనంతరం నుంచి బాలాజీ చెరువు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వాలంటీర్ల యూనియన్ జిల్లా కో కన్వీనర్ ఇనకోటి వరుణ్‌కుమార్, కునిరెడ్డి రవి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు వాలంటీర్లను రాజీనామా చేయొద్దని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీర్లను కొనసాగిస్తామని, పారితోషకాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంపుదల చేస్తామని ప్రకటించారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తికావస్తున్నా నేటికీ ఒక్క రూపాయి వేతనం కూడా అందలేదని, తక్షణం బకాయి పెట్టిన 5 నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లపై వైసిపి ముద్రవేసి తొలగించే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని, ఉద్యోగ భద్రతకై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో కుటుంబానికి కొంతమేరైనా చేదోడుగా ఉంటుందనే లక్ష్యంతోనే వాలంటీర్లుగా ఐదేళ్లుగా ప్రజలకు సేవ చేశామని, కరోనా సమయంలో వాలంటీర్లు ప్రజలకు చేసిన సేవలు గుర్తు చేసుకునైనా ఆ వ్యవస్థను కొనసాగించాలని కోరారు. నవంబర్ 6వ తేదీన జరిగే క్యాబినెట్ మంత్రుల సమావేశంలో వాలంటీర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. నవంబర్ 1, 2 తేదీల్లో తాహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన దీక్షలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీరుల పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు, తొట్టిపూడి రాజా, మేడిశెట్టి వెంకటరమణ, నందేశ్వరరావు, వాలంటీర్ల సంఘం నాయకులు ప్రకాష్, దాట్ల రమేష్, దుర్గాప్రసాద్, సతీష్, ప్రవీణ్, వరలక్ష్మి, పిల్లా భవాని, శ్రీదేవి, జాకబ్, నాగలక్ష్మి, డి.గంగా భవాని పాల్గొన్నారు.

ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

భవన నిర్మాణ రంగ కార్మికులను ఆదుకునేందుకు తక్షణమే ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జీ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవన్‌లో కేదారి నాగు అధ్యక్షతన సిపిఎం మండల మహాసభ జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందు సిపిఎం సీనియర్ నేత చల్లా విశ్వనాథం సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆర్ఎస్, బుద్ధాదేవ్ భట్టాచార్య, కొడియరి బాలకృష్ణన్ తదితరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేషబాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనలో కొత్తగా ఏమీ మార్పు జరగలేదని, మద్యం ఏరులై పారుగుతోందని విమర్శించారు. ప్రజలకు ఉచిత ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని, తద్వారా భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆంధ్రుల హక్కు, విశాఖ ఉక్కు నినాదంతో పోరాడి సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకోవా లన్నారు. ఈ మహాసభలో సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయ కులు కరణం ప్రసాదరావు, సిపిఎం పెద్దాపురం మండల కన్వీనర్ నీలపాల సూరిబాబు, నేతలు ఎస్.శ్రీనివాస్, డి.క్రాంతికుమార్, గడిగట్ల సత్యనారాయణ, డి.కృష్ణ, అప్పన్న, మరిడియ్య , సుబ్బలక్ష్మి, రమేష్, సత్తిబాబు, నాగు, పెంటయ్య, హనుమంతు, రాంబాబు పాల్గొన్నారు.



సిపిఎం మండల మహాసభలో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి

ఎంఆర్ కళాశాల విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మహారాణి కళాశాల విద్యార్థి జి.మల్లేశ్వరి ఇంటర్ కోలి గేట్ షూటింగ్ ఎయిర్ పిస్టల్ ఛాంపియన్షిప్ - 2024 పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించింది. సోమవారం కళాశాల ప్రిన్సిల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి మీడియాతో మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం బివి.రాజు కాలేజ్ యూనివర్సిటీలో ఈనెల 26న ఇంటర్ కోలి గేట్ షూటింగ్ ఎయిర్ పిస్టల్ ఛాంపియన్షిప్ - 2024 పోటీలు జరిగాయని తెలిపారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ తరపున ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని పాల్గొని ఈ పతకాన్ని సాధించిందన్నారు. ఈ సందర్భంగా ఈ పతకం సాధించిన మల్లీశ్వరిని ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, కరస్పాండెంట్ జాస్తి రమేష్, అధ్యాపకులు అభినందించారు.



మల్లేశ్వరిని అభినందిస్తున్న ప్రిన్సిపల్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

క్లాప్ డ్రైవర్ల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - కాకినాడ

మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ క్లాప్ డ్రైవర్ల అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సోమవారం అర్బన్ తహశీల్దార్ కార్యాలయం నుంచి అర్ధనగ్న ప్రదర్శనను కలెక్టరేట్ వరకూ నిర్వహించి, ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సిఐటియు కాకినాడ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్ పలివేల వీరబాబు మాట్లాడుతూ 4 రోజుల నుంచి క్లాప్ వాహన డ్రైవర్లు పలు రూపాల్లో ఆందోళన చేస్తున్నా అధికారుల్లో స్పందన లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మద్దతు ప్రకటించి మాట్లాడారు. దీపావళి పండగ సమీపిస్తున్న తరుణంలో కుటుంబంలో చిన్న పిల్లలు ఉంటే కనీసం బాణసంచా కొనుగోలు చేసుకునే పరిస్థితి లేదన్నారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోతే వారు ఎలా జీవించాలని ప్రశ్నించారు. తక్షణమే జిల్లా అధికారులు దృష్టి పెట్టి బకాయి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం అర్ధనగ్న ప్రదర్శన మాత్రమే చేశామని అధికారులు, కాంట్రాక్టర్ వేతనాలు త్వరగా చెల్లించకపోతే నగ్న ప్రదర్శన చేయడానికి వెనకాడబోమని క్లాప్ డ్రైవర్లు హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు ప్రకటించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు అందజేశారు. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్ మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి బకాయి జీతాలు చెల్లింపుకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, ఇస్మాయిల్, ఎం.కొండబాబు, శివశంకర్, గంగాధర్, దురాప్రసాద్, టి శ్రీను, భైరవ స్వామి, కె.దుర్గబాబు, ఎం.రాజు, ఎన్.సూరిబాబు, ఆర్.పూర్ణసతీష్, వి.అరుణ్‌కుమార్, ఆర్.వెంకటేష్, డి రాము, జె.కృష్ణమూర్తి, జెవివి.రమణ పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను అత్యంత నాణ్యతతో త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, సిపిఒ త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాసరావు, డీపీఎం ఎస్‌డిసి లావణ్యలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలన్నారు. రెవెన్యూ, పింఛన్, రేషన్ కార్డుల మంజూరు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, కేఎస్ఇజడ్ భూమి ఆన్‌లైన్లో నమోదు, ఆక్రమణలు తొలిగింపు, డ్రెయిన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు, వైద్య ఆరోగ్యం, ఆరోగ్య శ్రీ సేవలు, ఉద్యోగ ఉపాధి అవకా శాలు వంటి అంశాలకు చెందిన 428 అర్జీలు అందాయి. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీ లను క్షుణ్ణంగా పరిశీలించి, గడువు లోపు అర్జీదారుడు సంతృప్తి చెం దేలా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులుపాల్గొన్నారు.



సమస్యను వింటున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రేక్షకుల మదిలో నిలిచిపోయిన సూర్యకాంతం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సినీ రంగ జీవితంలో తన నటనతో అలరించి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా సినీ నటి సూర్యకాంతం నిలిచిపోయారని ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్, సావిత్రి కళావేదిక అధ్యక్షులు ఉంగరాల వెంకటేశ్వరరావు అన్నారు. సూర్యకాంతం శత జయంతి వేడకల సందర్భంగా సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 350 సినిమాల్లో నటించిన సూర్యకాంతం దిగ్గజ నటులైన ఎస్‌వి.రంగారావు, గుమ్మడి, ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్, ఛాయాదేవి వంటి నటులతో సమానంగా పాత్రలు పోషించారన్నారు. గయ్యాళి అత్త పాత్రలో గంభీరంగా ఉన్న,సేవా గుణంలో సూర్యకాంతం మిన్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో రోళ్ళ నాని, అందే బాబీ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఆధునిక వ్యవసాయంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రైతన్నలు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించి మంచి దిగుబడి సాధించిన రైతులు గోగుల లక్ష్మీనారాయణ, సంఘన ప్రభుజి, చిలకమర్తి ఆదినారాయణ, అడ్డాల త్రిమూర్తులు, రంది లక్ష్మయ్య, అల్లం బ్రహ్మంలను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి, జిల్లా వనరుల కేంద్రం డిడిఎ బి.హరి, ఎడిఎ వైవి.గంగాధర్, ఎఫ్‌టిసి ఎఇ డి.సంజీవ్‌కుమార్, వైస్ ఎంపిపి సాదె లోవరాజు, సర్పంచ్ పీతల నూకరాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాలను రద్దు చేయా లని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అగ్రహారంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం విద్యుత్ శాఖ డిఇఇ ఆర్.శ్రీనివాస్‌కి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ కె.చిన్న మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీలను పెంచమని ప్రకటించిన కూటమి పార్టీలు నేడు అధికార పగ్గాలు చేపట్టిన తరువాత విద్యుత్తు సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.6,072 కోట్ల భారాలను నవంబర్ ఒకటి నుంచి ప్రజలపై వేయడం దారుణమన్నారు. ప్రజలపై భారాలు వేయడానికి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఒకపక్క పెరుగుతున్న ధరలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, మరోపక్క ఉపాధి కరువైందని, ఈ తరుణంలో విద్యుత్ భారాలను వేయడం దారుణమన్నారు. ఎంపీలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలకు ఇస్తున్న జీతభత్యాలను తగ్గించుకోవడం ద్వారా ప్రజలపై కొంతమేరకు భారాలు తగ్గించుకునే వెసులుబాటు ఉందని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేసిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దు బాటు ఛార్జీల భారాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు కోనేటి రాజు, నాగేశ్వరరావు, మణి, స్టాలిన్, మణికంఠ, వీరబాబు, విశ్వనాథం, రాజేష్, నాగు, అరుణ్ కుమారి పాల్గొన్నారు.



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం శ్రేణులు

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్మికులు మున్సిపల్ కమిషనర్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఉన్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని, ఉన్న కార్మికులను బయట పనులకు వినియోగించుకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త నియామకాల్లో కరోనా సమయంలో విధులు నిర్వర్తించిన పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అధికారులు అవగాహనతో పని చేయాలి

ప్రజాశక్తి - సామర్లకోట

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రణాళికల తయారీ కీలకమని, వాటిపై జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ అధికారులు పూర్తి అవగాహనతో పని చేయాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ జె.వేణుగోపాల్ సూచించారు. సోమవారం స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో పలు జిల్లాలకు చెందిన డిపిఒలు, డిఎల్‌పిఒలు, ఎంపిడిఒలకు రెండు రోజుల శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నిధుల లభ్యత, ప్రణాళికలు తయారీ యాప్‌ల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పంచాయతీల అభివృద్ధిలో ప్రణాళికలు తయారీ కీలకపాత్ర వహిస్తుందని అధికారులు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ సెక్షన్లో శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్, ఎపిఎస్ఐఆర్‌డి జెడి జి.రమణ, శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీలు నిహారిక, వి.ప్రసాద్, శ్రీనివాస్, ఆంజనేయులు, చక్రపాణి, మొహిద్దీన్ రాజా తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం, ఎఎస్ఆర్, పాడేరు, కాకినాడ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన అధికారులు హాజరయ్యారు.



శిక్షణలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

అన్నదానానికి రూ.42 వేల విరాళం

ప్రజాశక్తి - పెద్దాపురం

తుని పట్టణానికి చెందిన సాయి మోటారు ప్లాజా ఆదర్శ్ బజాజ్ టు వీలర్ షోరూమ్ అధినేత చెక్కా సతీష్ అన్నదాన కార్యక్రమానికి రూ.42 వేల విరాళాన్ని అందజేశారు. సోమవారం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలతో చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.



బాధితురాలకి సంఘీభావంగా ధర్నా చేస్తున్న గ్రామస్తులు

వివాహితపై లైంగిక వేధింపులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వివాహితను లైంగిక వేధింపులకు గురి చేసిన సంఘటన మండలంలోని చింతలూరు గ్రామంలో చోటుచేసుకుంది. దీనిపై బాధితురాలు ప్రగతిశీల మహిళా సంఘాన్ని ఆశ్రయించింది. సోమవారం ప్రగతిశీల మహిళా సంఘం, సిపిఐ(ఎంఎల్ లిబరేషన్) ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు పెద్దాడ రాజేశ్వరి దేవి మాట్లాడుతూ గడిచిన ఏడాది కాలం నుంచి తనను చింతలూరు గ్రామానికి చెందిన మాస అర్జునుడు వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన కోరిక తీర్చకపోతే చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్ లిబరేషన్) రాష్ట్ర కమిటీ సభ్యులు మానకొండ లచ్చబాబు, తాడి లక్ష్మణరావు, దుమ్ముల సింహాచలం, అల్లా భాస్కరరావు, ముప్పిడి వీరమణి, వరలక్ష్మి, పాల్గొన్నారు.

ఆదిత్య సివిల్ విభాగంలో కార్యశాల

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో కాంక్రీట్ మిక్స్ డిజైన్ అనే అంశంపై కార్యశాల నిర్వమించారు. అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అల్ట్రాటెక్ సిమెంట్ సాంకేతిక మేనేజర్ సాయిప్రసాద్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. రీజినల్ హెడ్ ఆఫ్ టెక్నికల్ సర్వీసెస్ సురేష్‌కుమార్ వర్క్‌షాప్ ప్రాముఖ్యత, నాణ్యతను నిర్ధారించడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని వివరించారు.

పిఆర్ హైస్కూల్ మెయిన్ రోడ్ గేటు తెరవాలి

ప్రజాశక్తి - కాకినాడ

మెయిన్ రోడ్‌లో ఉన్న పిఆర్ హైస్కూల్ ప్రధాన గేటును తెరవాలని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మెయిన్ రోడ్ గేట్ నుంచి టిటిడి సెంటర్ గేటు వరకూ ఉన్న మార్గంలో వీధిజ లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం నెలకుంటుందన్నారు. మద్యం, గంజాయి సేవించే అసాంఘిక శక్తులకు ఈ ప్రాంతం అడ్డాగా మారిందన్నారు.

ప్రభాస్ అభిమానుల అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

సినీ నటుడు ప్రభాస్ జన్మదిన పురస్కరించుకుని ఆయన అభిమానులు స్థానిక ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్లో అన్నదానం చేశారు. ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేష్, హరికృష్ణల ఆధ్వర్యంలో పేదలకు అన్నదనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి కార్యదర్శి అప్పలరాజు మాట్లాడారు.ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

హత్య కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని చింతలూరు గ్రామంలో 2014 డిసెంబర్ 29వ తేదీన భార్యా భర్తల మధ్య ఉన్న గొడవలు నేపథ్యంలో కూనిశెట్టి అప్పారావు తన భార్య సుజాతను మెడకు చున్ని బిగించి హత్య చేశారు. అప్పట్లో ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేయగా అప్పటి సిఐ జి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో వాదోపవాదలను విన్న పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.చంద్రమౌళి సోమవారం ముద్దాయికి జీవిత ఖైదు శిక్షతోపాటు మరో మూడేళ్ల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. రూ.1000 చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష విధించినట్లు ప్రత్తిపాడు సిఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.మృత్యుంజయరావు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం ఆర్టిసి డిపోలో డ్రైవర్గా పనిచేసి అనారోగ్యంతో పదవీ విరమణ పొందిన లింగంపర్తి గ్రామానికి చెందిన డ్రైవర్ ఎవిఎస్.సత్యనారాయణ ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. ఎస్ఐ ఎన్.రామలింగేశ్వర్ రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 4 సంవత్సరాల కితం పదవీ విరమణ పొందిన సత్యనారాయణకు సంస్థ నుంచి రావలసిన డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సత్యనారాయణ ఆదివారం గడ్డి మందు తాగాడన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి కాకినాడ ఆసుపత్రికి తరలించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సత్యనారాయణ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డివైడర్ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి - గండేపల్లి

మచిలీపట్నం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు అదుపుతప్పి గండేపల్లి గ్రామంలో జాతీయ రహదారి డివైడర్ను ఢీకొంది. సిసి ఫుట్పాత్ డివైడర్ను ఢీకొన్న కారు గాల్లోకి ఎగిరి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తల్లీ, కొడుకులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ శివనాగ సంఘటన స్థలానికి చేరుకుని హైవే మొబైల్ వాహనంలో గాయపడిన వారిని జగ్గంపేట ఆసుపత్రికి తరలించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని జి.మేడపాడు గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 21 మందిని అదుపులోకి తీసుకుని రూ.84,200 నగదు, 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ దాడుల్లో సామర్లకోట సిఐ కృష్ణభగవాన్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. అరెస్టు చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కోటనందూరు

సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తుని రూరల్ ఎస్ఐ బి.కృష్ణమాచారి తెలిపారు. తుని రూరల్ మరువాడ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా అల్లిపూడిపాలెం గ్రామానికి చెందిన కొంకిపాటి వీరబాబు తన బ్యాగులో 10 లీటర్ల నాటు సారాను తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

88 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పిఠాపురం

రూ.1.76 లక్షల విలువ చేసే 88 కేజీల గంజాయిని సోమవారం పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు ఆటో, బైకును సీజ్ చేశారు. సోమవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ముందస్తు సమాచారంతో రాపర్తి జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాపర్తి గ్రామం వైపు నుంచి పల్సర్ మోటార్ సైకిల్పై ఒక వ్యక్తి పైలెట్గా వ్యవహరిస్తూ వస్తుండగా వెనకాల పాసింజర్ ఆటోలో గంజాయి మూటలతో రావడాన్ని గమనించి తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పారిపోయేందుకు ప్రయత్నించిన ఎం.మణికంఠరాజు, జి.మహేశ్వరరావు, కె.రాము, ఎం.సన్యాసి రాజు అనే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 88 కేజీల గంజాయిని, ఆటో, బైక్ స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు గంజాయి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి నర్సీపట్నం, రౌతులపూడి, పిఠాపురం మీదుగా కాకినాడకు అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయి పిఠాపురం మండలం సింహాద్రిపురం గ్రామానికి చెందిన ఎం.మణికంఠరాజు 2016 సంవత్సరంలో సెంట్రింగ్ పనుల నిమిత్తం చింతపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో పనిచేస్తూ ఉన్న సమయంలో అక్కడ గంజాయి వ్యాపారులతో పరిచయాలు ఏర్పడ్డాయి. అక్కడి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చుట్టుపక్కల ప్రాంతాలలో అమ్ముతూ వ్యాపారం నిర్వహిస్తుండే వాడన్నారు. సదరు వ్యక్తి పై సామర్లకోట రైల్వే పోలీస్ స్టేషన్, గాజువాక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు ఉన్నాయన్నారు. అరెస్టు చేసిన నలుగురిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ మణికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పొన్నాడ పంచాయతీ పరిధిలో ఉన్న పల్లిపేట సమీపంలోని వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకటేష్ సోమవారం తెలిపారు. ఉప్పాడ వాగులో కొట్టుకు వెళ్తున్న మృతదేహాన్ని అక్కడి స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని వెలికి తీసి పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. మృతుని ఒంటిపై పసుపు, నలుపు గల గడిల చొక్కా, నలుపు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. అలాగే చేతికి స్టీల్ కడియం ఉన్నట్లు తెలిపారు.

జగన్కు జైలు ఖాయం : యనమల

ప్రజాశక్తి - కోటనందూరు

సహజ సంపదను దోచుకున్న జగన్ మళ్ళీ జైలుకెళ్లడం ఖాయమని టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం తేటగుంట కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని సహజ సంపదను దోచుకుని లక్ష కోట్ల రూపాయలు అక్రమ ఆస్తులను కూడబెట్టుకున్నారని ఆరోపించారు. అప్పట్లోనే జగన్పై ఆర్థిక నేరగాడిగా కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఆ కేసును సిబిఐకి అప్పగించడంతో అది నిర్ధారణ అవడంతో జైలుకెళ్లడం జరిగిందని గుర్తు చేశారు. బెయిల్



మీడియాతో మాట్లాడుతున్న యనమల

మీద వచ్చే ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఆంధ్ర ప్రజలను పరిపాలించి రాష్ట్రానికి అపకీర్తిని తెచ్చిన ఘనత వైఎస్.జగన్ దేనిని అన్నారు. తండ్రి కూడబెట్టిన ఆస్తిని చట్ట ప్రకారం ఆయన చెల్లికి, తల్లికి పంపకాలు చేయకుండా వారిని న్యాయస్థానాలు చుట్టూ తిప్పిస్తున్నారని విమర్శంచారు. సొంత కుటుంబానికే న్యాయం చేయని జగన్ రాష్ట్ర ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. జగన్ ఐదేళ్ల పాలనలో జగన్ చేసిన అవినీతి అక్రమాలను త్వరలోనే బయట పెడతామని అన్నారు .కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు జగన్మోహన్ రెడ్డికి లేదని అన్నారు. చంద్రబాబు, పవన్ ఆంధ్ర రాష్ట్రాన్ని ఆర్థికంగానూ, పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని అన్నారు. బాబాయ్ని హత్య చేసిన అవినాష్ రెడ్డిని జగన్ కాపాడుతున్నారని, సొంత బాబాయి, చెల్లి, తల్లి కంటే అవినాష్ రెడ్డే ముఖ్యమని భావించి కాపాడుతున్నారని అన్నారు . జగన్ కుటుంబంలో విజయసాయిరెడ్డి శకుని పాత్ర పోషిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సునీతకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కరప

మండలం పెనుగుదురు ఫీల్డ్ అసిస్టెంట్ సునీతకు న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థాని తహశీల్దార్ కార్యాలయం, పోలీస్స్టేషన్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు టి.ఈశ్వరరావు మాట్లాడుతూ సునీతను జనసేన నాయకులు ఇబ్బందులకు గురి చేయడంతో ఆమె మనస్థాపానికి గురియై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో



ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

చికిత్స పొందుతుందని, అయితే ఇప్పటి వరకూ బాధ్యులపై పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. తక్షణమే ఆమెను ఇబ్బందులకు గురిచేసిన వారిపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ దళిత సంఘం నాయకులతో చర్చలు జరిపారు. అనంతరం కారకులపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ నాయకులు పండు అశోక్, బిఎస్పి జిల్లా అధ్యక్షులు సుబ్బుబాయ్, బిఎస్పి నాయకులు ఖండవల్లి లోవరాజు, కరప మండల అంబెద్కర్ యువజన సంఘం అధ్యక్షులు గుబ్బల రామకృష్ణ, పత్తిపాటి బుల్లిరాజు, మొసలి శ్యామ్, పోట్లకాయల నానిబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎల్ఐసి ఏజెంట్ల నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద జరిగిన ఏజెంట్ల నిరసన శిబిరాన్ని సిపిఎం నాయకులు కోనేటి రాజు, కుంచె చిన్న, జి.అప్పారెడ్డి, సిహెచ్.సాంబశివకుమార్, కె.నాగేశ్వరావు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసికి ఆదాయం సమకూర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత 16 రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ఏజెంట్ల యూనియన్ అధ్యక్షులు ఎల్.రామకృష్ణ, కార్యదర్శి కెవివి.సత్య నారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ట్రజరర్ కె.రాంబాబు, బిఎస్. ప్రకాష్రావు, ఎ.గంగాధర్రావు, యు.రామచంద్రరావు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద ఎల్ఐసి ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కొత్త పాలసీలపై కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. పేద మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా రూ లక్ష పాలసీని



పిఠాపురంలో ఏజెంట్లకు మద్దతు ఇస్తున్న సిపిఎం నేతలు

కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అప్పాన నాగేశ్వరరావు, గొండేల జగదీశ్వరరావు, పిండి రెడ్డమ్మ, కృష్ణంరాజు, గోరింట అబ్బులు, గౌరీపతి, అర్జునరావు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక ఎల్ఐసి శాటిలైట్ బ్రాంచ్ కార్యాలయం వద్ద ఎల్ ఐ సి ఏజెంట్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్లు సంఘం అధ్యక్షుడు కోరుకొండ నూకరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొళ్ళ నాగేశ్వరరావు, సంఘం ఉపాధ్యక్షుడు టి.పరదేశిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.లక్ష్మణరావు, వెల్లంపల్లి సుబ్బారావు, పాండ్రంకి నూకరాజు, మాగంటి సూరిబాబు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.4లక్షల విరాళం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మఠం సెంటర్ వద్ద వీరభద్ర రామాలయంలో వివిధ అభివృద్ధి పనులకు ప్రవాస భారతీయులు మన్యం సత్తిరాజు కుమారుడు, కోడలు డాక్టర్ మన్యం కూర్మనాథ్, డాక్టర్ మన్యం వాణి దంపతులు రూ.4 లక్షల విరాళాన్ని అందజేశారు. సోమవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా దాత దంపతులను చినరాజప్ప అభినందించారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వరాలయం ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్మోహన్, కమిటీ ప్రతినిధులు నాగేశ్వరరావు, బాపినీడు, గాంధీ, సత్యవతి పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటనారాయణ

ప్రజాశక్తి - కోటనందూరు

ఎన్టిఆర్ గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ పి.వెంకటనారాయణ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ సెక్రటరీలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను ప్రజలకు తెలియపరచాలని, గ్రామాల్లో పన్నులు వసూలు వేగవంతం చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను, ఇంకుడు గుంట్ల నిర్మాణాలను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రూ.2.50 కోట్లు నిధులను కేటాయించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని, పనులు వేగవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్డి, సెక్రటరీలు పాల్గొన్నారు.

సామర్లకోటలో అన్నదానం

ప్రజాశక్తి - సామర్లకోట

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక పాత్రుళ్ళ వీధిలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి అయ్యారక విభాగం రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, అయ్యారక కార్పొరేషన్ మాజీ ఛైర్పర్సన్ ఆవాల రాజేశ్వరి దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంతాడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పెద్దిపాలెం పిహెచ్సి ఆధ్వర్యంలో వంతాడలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెద్దిపాలెం పిహెచ్సి వైద్యులు డాక్టర్ యశస్వి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ఫీవర్ సర్వేలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలులో తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సబ్ జైలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ప్రకాష్బాబు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సబ్ జైల్లో ఉన్న ముద్దాయిల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందజేస్తున్న వసతులు, భోజనాలు వంటి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ ఎస్.దుర్గారావు, సూపరింటెండెంట్ వై.శావణ్కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



టిడిపి సభ్యత్వం తీసుకోవడంతో కుటుంబానికి భరోసా వస్తుందని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. సోమవారం తన నివాసంలో ఆమె సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతీ ఒక్కరూ టిడిపి సభ్యత్వం తీసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు అంతా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

తటవర్తి శ్రీనివాసరావు మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - కాకినాడ

మహర్షి సాంబమూర్తి సామాజిక విషయాల అధ్యయన సంస్థ, వికలాంగ బాలికల ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపక కార్యదర్శి తటవర్తి శ్రీనివాసరావు మృతి పట్ల సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కాకినాడలో వికలాంగ బాలికల ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. సామాజిక, రాజకీయ అంశాలపైన, ప్రాంతీయ సమస్యలపైన నివేదికలు తయారు చేసేవారని గుర్తు చేశారు. తటవర్తి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఎంపీ తీరుపై ఎంఎల్ఎ అనుచరుల బైటాయింపు

ప్రజాశక్తి - కాకినాడ

దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో కాకినాడ ఎంపీ, ఎంఎల్ఎ అనుచరుల మధ్య వివాదం రేగింది. కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ తీరుకు వ్యతిరేకంగా ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అనుచరులు స్థానిక ఆర్డిఒ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై బైటాయించారు. దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటు విషయంలో తమ వారికి రాకుండా ఎంపీ అనుచరులు అడ్డుకున్నారని నినాదాలు చేశారు. అంతేకాకుండా కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కనుసన్నులలో పనిచేస్తున్నారంటూ నినాదాలు చేశారు. కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న నాన్ స్టాప్ బస్సును కొంతసేపు టిడిపి శ్రేణులు అడ్డగించడంతో ట్రాఫిక్ను పోలీసులు మళ్లింపు చర్యలు చేపట్టారు. ఈ సమస్యపై కాకినాడ ఆర్డిఒ ఎస్.మల్లిబాబును వివరణ కోరగా కాకినాడ పరిధిలో 128 దుకాణాలకు గాను 127 దుకాణాలకు కేటాయింపులు జరిగాయని వాటిలో ఒక్కదానికి మాత్రమే నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో అనుమతులు ఆపమన్నారు. ఆ దుకాణం కాకినాడ మెయిన్ రోడ్లో ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య, ఇరువైపులా దుకాణాలు ఉండటంతో అనుమతిని ఆపామన్నారు. కాకినాడ ఎంపీపై ఎంఎల్ఎ అనుచరులు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టడం నగరంలో చర్చనీయాంసంగా మారింది.

100 రోజుల పని కల్పించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ పథకంలో కూలీలందరికీ వంద రోజులు పని కల్పించాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు, టిడిపి నాయకులు మోపూరి వెంకటేశ్వర్లు కోరారు. సుంకరపాలెం పంచాయతీ కార్యదర్శి జ్యోతి సుధా అధ్యక్షతన జరిగిన గ్రామసభలో వారు మాట్లాడారు. పని కోరిన ప్రతి వ్యక్తికి జాబు కార్డు ఇవ్వాలని అన్నారు. బాబా నగర్ కులాయి ట్యాంకు వద్ద రక్షణగా కంచె నిర్మించాలని, ఈ కార్యక్రమంలో ఎపిఒ తేజస్విని పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో సోమవారం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆప్ ఇండియా విజిలెన్స్ ఎవేర్నెస్ వీక్ - 2024 సందర్భంగా 'కల్చర్ ఆప్ ఇంటిగ్రిటీ పర్ నేషన్స్ ప్రాపర్టీ' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధానోత్సవ సభలో విజేతలైన ఎం.హరికిరణ్(ప్రథమ), కె.కావ్యలహరి(ద్వితీయ), ఎస్.వేణు (తృతీయ), కె.అనుపల్లవిలకు బహు మతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ జాస్తి రమేష్, పవర్ గ్రిడ్ డిప్యూటీ మేనేజర్ ఎంఎస్ఆర్.పవన్కుమార్, ఎటిఒఎ ఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ లైన్కు మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కరప



స్తంభాలు వేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

మండలంలోని నడకుదురు గ్రామంలో రామలింగేశ్వర కాలనీకి వెళ్లే రహదారిలోని విద్యుత్ లైన్కు సంబంధిత శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో విద్యుత్ శాఖ నిర్వా కాన్ని ఆదివారం 'ప్రజాశక్తి' వెలుగులోకి తెచ్చిన విషయం పాఠ కులకు విధితమే. ఈ నేపథ్యంలోనే సోమవారం విద్యుత్ శాఖ అధికారి ఎస్.ఈశ్వర్ప్రసాద్ సిబ్బందితో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానే కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బాణసంచా విక్రయాల్లో భద్రత తప్పనిసరి

ప్రజాశక్తి - సామర్లకోట

బాణసంచా దుకాణాల వద్ద పూర్తి భద్రతా ప్రమాణాలు తప్పనిసరి అని, వాటిని పాటించకుంటే చర్యలు తప్పవని తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాణసంచా తయారీదారులు, దుకాణదారులకు షాపుల లైసెన్సులు జారీని ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా అందిస్తుందని, నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. మూడు రోజులు మాత్రమే విక్రయాలకు అనుమతి ఇస్తున్నామన్నారు. బాణసంచా విక్రయాలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ, వేట్లపాలెం గ్రామం వద్ద దుకాణలకు అనుమతి ఉన్నందున అక్కడ మాత్రమే విక్రయాలు జరపాలన్నారు.

ఎటిఎం చోరీ కేసులో నాలుగేళ్ల జైలు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక చర్చ్ సెంటర్ సమీపంలో ఉన్న డిసిసి బ్యాంకు ఎటిఎం ను ధ్వంసం చేసి చోరీకి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం జేఎఫ్ సిఎం కోర్ట్ న్యాయమూర్తి ఎం.విజయ రామేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. సెల్ఫ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన ఎటీఎంను బద్దలు కొట్టి రూ.1100 చోరీ చేసినట్లు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టిన అధికారులు అప్పట్లో పట్టణానికి చెందిన పి.సూరి బాబును అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ తరపున ఆకుల లీల నాగరోజా వాదనలు వినిపించగా నేరం రుజువు కావడంతో సదరు ముద్దాయికి నాలుగేళ్ల జైలు, రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు.

బాణసంచా సామగ్రి స్వాధీనం

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధి కొంతమూరులో ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2లక్షల విలువైన బాణసంచా సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు బాణసంచా సామగ్రిని ఇళ్ల మధ్య నిల్వ ఉంచినట్టు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సోదాలు నిర్వహించగా నిల్వ ఉంచిన బాణసంచాను గుర్తించామన్నారు. స్వాధీనం చేసుకున్న దీపావళి సామాగ్రి రాధేయపాలెంలో భద్రపరిచి యజమానికి నోటీసు ఇచ్చామన్నారు.

విమానాశ్రయ నిర్మాణ ప్రతిపాదన విరమించుకోవాలి

ప్రజాశక్తి - కోటనందూరు

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవ దేవస్థానం సమీపంలో విమానాశ్రమ నిర్మాణ ప్రతిపాదనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విరమించుకోవాలని ఆ ప్రాంత ప్రజలు ఆందోళన చేపట్టారు. తొండంగి మండలం బెండపూడి, పిహెచ్.చిన్నయపాలెం గ్రామాల సమీపంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవ దేవస్థానం ఉంది. ఈ గ్రామాల సమీపంలో విమాన ఆశ్రయ నిర్మాణాన్ని నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ గ్రామాల్లో విమానాశ్రయ నిర్మాణానికి 519 ఎకరాల్లో భూ సేకరణ కొరకు అన్వేషణ చేస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక గ్రామస్తులు తెలుసుకుని ఈ ప్రాంతంలో విమానాశ్రయ నిర్మాణాన్ని చేపట్ట వద్దంటూ సోమవారం రెండు గ్రామాల ప్రజలు భేటీ అయ్యారు. విమానాశ్రయం నిర్మాణం వల్ల తమ భూములు కోల్పోతామని, ఇది మనకు అవసరం లేదంటూ తీర్మానించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ బెండపూడి, పిహెచ్ చిన్నయ్యపాలెం గ్రామల పరిధిలో సుమారు 1850 మంది రైతులు వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నారని అన్నారు. అటువంటి ప్రాంతంలో విమానాశ్రయం పేరుతో తమ భూములను లాక్కుంటే తమ కుటుంబాలు ఏమి కావాలని ప్రశ్నించారు. తక్షణమే ఆ ఆలోచనను ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా గ్రామాల రైతులు తేటగుంట క్యాంపు కార్యాలయంలో ఉన్న టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడుని కలుసుకుని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై రైతులు ఆందోళన చెందవద్దని, కలెక్టర్తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం స్థానిక లెక్చరర్ కాలనీలోని రోటరీ బ్లడ్ బ్యాంకు వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డిఎస్పి శ్రీహరిరాజు, ఎస్ఐలు రావూరి మురళీమోహన్, మూర్తి, పలువురు పోలీసులు రక్తదానం చేశారు. అలాగే సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు 51 మంది, జగ్గంపేట హెల్పింగ్ హాండ్స్ యూత్ 14 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీహరిరాజు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడిన వారం అవుతామని, యువత రక్తదానం చేయడం అలవాటుగా చేసుకోవాలన్నారు.